క్లుప్తంగా

జీజీహెచ్‌లో బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



గుంటూరు ఈస్ట్: జీజీహెచ్‌లో బాలింతలకు శుక్రవారం డెప్యూటీ మేయర్ షేక్ సజీల పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ బాలింతల వార్డులో పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి ముందుకు వస్తున్న దాతలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మశ్రీ , దరియా హుస్సేన్ పాల్గొన్నారు.

వేద విద్యార్థులకు నగదు, సామగ్రి పంపిణీ

గుంటూరు ఈస్ట్: కొత్తపేటలోని యడవల్లివారి ధర్మ సత్రంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని వివిధ వేద పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు నగదుతో పాటు సామగ్రి పంపిణీ చేశారు. కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అన్నాప్రగడ కుమారస్వామి మాట్లాడుతూ మొత్తం 112 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1,116తో పాటు ధావళి, ఆసనములు, కొమ్ము చెంబులు, పట్టు అంగవస్త్రం, పండ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. వేద విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించి దేశ సంస్కృతి, సంప్రదాయాల్ని పరిరక్షించాలని కోరారు.

ఏటీ అగ్రహారం పేరుతో సూచిక బోర్డుల ఏర్పాటు



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక సిబ్బంది అవగాహనలోపంతో ఏటీ అగ్రహారం రెండో లైనుకు ఫాతిమా నగర్ అని బోర్డు ఏర్పాటు చేశారు. దీనిపై దుమారం రేగడంతో నగర కమిషనర్ కీర్తి చేకూరి, మేయర్ కావటి మనోహర్‌నాయుడు వెంటనే స్పందించారు. శుక్రవారం మధ్యాహ్నం నాటికల్లా ఫాతిమానగర్ బోర్డులు తొలగించి, ఏటీ అగ్రహారం పేరుతో ఏర్పాటు చేయించారు.

సామాజిక సమానత్వ ప్రబోధకుడు బుద్ధుడు



నెహ్రూనగర్: సామాజిక సమానత్వ ప్రబోధకుడు బుద్ధుడని భీం భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని భీమ్ భారత కార్యాలయంలో శుక్రవారం బుద్ధ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ బుద్ధుడు మార్గాన్ని బాబా సాహెబ్ అంబేడ్కర్ పయనించి, దేశ ప్రజల్ని చైతన్య పరిచారని తెలిపారు. ప్రజలందరూ సామాజికంగా, ఆర్థికంగా సమానత్వం సాధించేందుకు అంబేడ్కర్ నిరంతరం కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో అంకం శ్యామ్, మేకల మీరయ్య, రావినూతల కమల కుమారి, ఎర్రగుంట్ల సుజాత పాల్గొన్నారు.

కన్నుల పండువగా భావదేవుని రథోత్సవం



పొన్నూరు(చేబ్రోలు): చారిత్రక ప్రసిద్ధి గాంచిన పొన్నూరులోని సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణస్వామి దివ్య రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. గరుడ వాహనంపై స్వామి పుర వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. రమణమ్మ పర్యవేక్షించారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రారంభం నుంచి రథం రథశాలకు తిరిగి వచ్చే ఆయన భక్తులతో కలసి ఉత్సాహంగా పాల్గొన్నారు.

కలసికట్టుగా నగరాభివృద్ధికి కృషి

నగర మేయర్ కావటి, తూర్పు ఎమ్మెల్యే ముస్తఫా



గాంధీ పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి మనోహరనాయుడు

నెహ్రూనగర్: గుంటూరు నగర అభివృద్ధికి కలసికట్టుగా విభేదాలు లేకుండా పనిచేస్తున్నామని, తామంతా వైఎస్సార్ సీపీ కుటుంబమని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా స్పష్టం చేశారు. గాంధీ పార్కులో అభివృద్ధి పనుల్ని శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని మార్కెట్ సెంటర్ నందు సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో గల నగర పాలక సంస్థ గాంధీ పార్కు పునర్నిర్మాణ పనులు ముగింపు దశకు వచ్చాయని తెలిపారు. గత ప్రభుత్వాలు పార్కు అభివృద్ధిని నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. తమ పాలక వర్గం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలియజేశారు. పార్కులో ఆహ్లాదం కోసం చిల్డ్రన్స్ ప్లే ఎక్విప్మెంట్, పెద్దలకు ఓపెన్ జిమ్, స్కేటింగ్ పరికరాలు, ఫౌంటెన్లు, సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నగరంలో సుమారు 2 వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో యూజీడీ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. 57 డివిజన్లలో సమ న్యాయంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. నగర అభివృద్ధిని ఓర్వలేక టీడీపీ నాయకులు చర్చకు సిద్ధమా ? అంటూ ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. టీడీపీ నాయకులు ఎక్కడ చర్చకు పిలిచిన తాము సిద్ధమని వెల్లడించారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ నగరపాలక సంస్థలో నూతన పాలక వర్గం ఏర్పడ్డాక గాంధీ పార్కుతో పాటు నగరంలో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు, ఎస్ఈ భాస్కర్, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, ఏడీహెచ్ రామారావు, ఏఈలు, ఇంజినీరింగ్, పార్కు సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మ మొబైల్ హెల్త్ వెహికల్ ప్రారంభం



వెహికల్‌ను ప్రారంభిస్తున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ అండ్ వెల్ఫేర్ డైరెక్టర్ రామిరెడ్డి

పెదనందిపాడు: గ్రామస్తులకు అందుబాటులో ఉంటూ మొబైల్ హెల్త్ వెహికల్‌ను ప్రారంభించడం అభినందనీయమని హెల్త్ అండ్ ఫ్యామిలీ అండ్ వేల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ వి. రామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని పాలపర్రులో శుక్రవారం ఉదయం శారద సర్వీస్ సొసైటీ తెనాలి వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధర్మ మొబైల్ హెల్త్ వెహికల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ మొబైల్ వ్యాన్‌లోనే బీపీ, ఈసీజీతో పాటు ఇతర స్కానింగ్ పరికరాలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామస్తులు వీటిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎ. శ్రావణ్‌బాబు, తెనాలి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అన్నపూర్ణ, శారద సర్వీస్ సొసైటీ సభ్యురాలు శారద, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రాండ్ నాగార్జున హోటల్ పునఃప్రారంభం



హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

పాత గుంటూరు: కోణార్క్ హోటల్ నూతన యాజమాన్యంలో హోటల్ గ్రాండ్ నాగార్జున హోటల్ శుక్రవారం పునః ప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మేయర్ కావటి మనోహర్ నాయుడు, టీడీపీ సీనియర్ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, పారిశ్రామికవేత్త తులసి ధర్మచరణ్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్ పాల్గొన్నారు. చైర్మన్ ఎలవర్తి నాగరాజు మాట్లాడుతూ హోటల్‌లో ఫ్యామిలీ రెస్టారెంట్, ఫంక్షన్ హాల్స్, కాన్ఫరెన్స్ మీటింగ్ హాల్స్, సూట్ రూమ్స్ ఉన్నాయని తెలిపారు.అత్యాధునిక ఇంటీరియర్ డిజైన్‌తో, ఆహ్లాదకరమైన వాతావరణంలో నార్త్ ఇండియన్, చైనీస్, ఆంధ్ర స్పెషల్, వివిధ రకాల వెజ్, నాన్ వెజ్ వంటకాల్ని అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో హోటల్ సిబ్బంది పాల్గొన్నారు.

10,11 తేదీల్లో ఇంపాక్ట్ మెగా ఈవెంట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న లక్ష్మీనారాయణ, మట్టుపల్లి మోహన్, చల్లా రవి, ఆరుద్ర తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 10,11వ తేదీల్లో నిర్వహిస్తున్న ఇంపాక్ట్ మెగా ఈవెంట్‌కు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులతో పాటు వివిధ రంగాల ప్రముఖులు హాజరవుతున్నట్లు మాస్టర్ మైండ్స్ డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమ పోస్టర్లను విశ్రాంత ఐపీఎస్ అధికారి వి.వి. లక్ష్మీనారాయణ, ఇంపాక్ట్ గుంటూరు ఇన్‌చార్జ్ చల్లా రవి, డాక్టర్ యద్దనపూడి ఆరుద్రతో కలసి ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంపా నాగేశ్వరరావు నేతృత్వంలో వ్యక్తిత్వ వికాసం, సామాన్యుల జీవితాల్ని మార్చే దిశగా అద్భుతమైన మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 1,500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, వ్యాపారవేత్తలతో పాటు అనేక రంగాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్న ఈ మహాయజ్ఞం ఉచిత రిజిస్ట్రేషన్ కోసం 9494466389 నంబర్లో సంప్రదించాలని ఆయన సూచించారు. పేర్లను htt pr://-f-am pa.i n/e-ve nt నమోదు చేసుకోవాలని తెలిపారు. మెగా ఈవెంట్‌కు హాజరు కానున్న మోటివేటర్స్‌లో భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్, పొగాకు బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, యోగా గురువు జగన్ గురూజీ, సీఐడీ ఎస్పీ కేజీవీ సరిత, ఆకెళ్ల రాఘవేంద్రరావు, గ్రంధి కాంతారావు, బాలలత, వేణుగోపాల్, ఆర్‌టీఎస్ కృష్ణ ప్రభు, ప్రదీప్ కంపర్తి, శ్రీపాద రామ్, వేణుకళ్యాణ్ తదితరులు ఉన్నారని వివరించారు.

క్రైమ్ కార్నర్

వ్యక్తిపై దాడి

గుంటూరు ఈస్ట్: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై నలుగురు దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటుకూరు గ్రామానికి చెందిన ఎస్.శ్రీనివాసరావు గురువారం రాత్రి గాయత్రీ నగర్ ప్రాంతంలో వెళుతుండగా పాత కక్షల నేపథ్యంలో ప్రసాద్‌రెడ్డి, అతని అనుచరులు మరో ముగ్గురు కలసి దాడి చేశారు. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తాగుతున్న నలుగురి అరెస్టు

గంజాయి తాగుతున్న వారిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రెడ్డి కళాశాల సమీపంలో కొందరు గంజాయి తాగుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి వంద గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుల దూషణపై కేసు నమోదు

కుల దూషణపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు అరుంధతీనగర్‌కు చెందిన దివ్య, ఊటుకూరు గ్రామానికి చెందిన షేక్ అల్తాఫ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఇటీవల అల్తాఫ్, అతని తల్లి పర్వీన్‌లు దివ్యను అదనను కట్నం కోసం తరచూ వేధిస్తున్నారు. కులం పేరుతో దూషించి, కొట్టి ఇంటి నుంచి బయటకు తరిమేశారు. పుట్టింటికి చేరిన దివ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

బాలిక అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శివనాగరాజు కాలనీలో నివసించే ఓ కుటుంబానికి చెందిన బాలిక ఈనెల 4న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరస్పర ఫిర్యాదులపై కేసు నమోదు

పట్నంబజారు: పరస్పర ఫిర్యాదులపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. షాప్ ఎంప్లాయీస్ కాలనీకి చెందిన ఓ యువతి కొత్తపేటలోని నీరజ న్యూరో కేర్ ఆసుపత్రిలో అకౌంటెంట్‌గా పని చేస్తోంది. అమరావతికి చెందిన షేక్ నాగూర్ హుస్సేన్ కాకాని రోడ్డులోని వేదాంత ఆసుపత్రిలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే, నిత్యం వెంటపడి వేధిస్తున్నాడని యువతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో బాధిత యువతి బంధువు అయ్యప్పతో పాటు మరికొంత మంది కలసి డ్రైవర్ నాగూర్ హుస్సేన్, అతడు పని చేస్తున్న ఆస్పత్రి యజమాని చింతా నాగేశ్వరరావు ఇంటి వద్ద గొడవ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు చింతా నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బాడీ బిల్డర్లకు మేయర్ అభినందనలు



నెహ్రూనగర్: గత నెలలో చండీఘర్, ఢిల్లీల్లో జరిగిన జాతీయస్థాయి బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్ జూనియర్, సీనియర్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి పలు మెడల్స్ సాధించిన బుడంపాడు చెందిన హరిహర రమేష్‌శర్మను, నగరంపాలేనికి చెందిన శాఖమూరి కార్తిక్‌లను మేయర్ అభినందించారు. సంపత్ నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మేయర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో హరిహర రమేష్ శర్మ, శాఖమూరి కార్తీక్ పాల్గొని గోల్డ్ మెడల్స్ సాధించి, నగరానికి మంచి పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి



పాత గుంటూరు: లక్ష్మీపురం త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో శ్రీ త్యాగరాజ కళా వేదికగా శుక్రవారం శాస్త్రీయ సంగీత కచేరి వీనుల విందుగా సాగింది. హైదరాబాద్‌కు చెందిన గండూరి లహరి పలు వాగ్గేయకారుల కృతుల్ని శ్రావ్యంగా ఆలపించారు. ఆమెకు వయోలిన్‌పై మహావాది వాసు, మృదంగంపై బచ్చు జనార్దన్ సహకారాన్ని అందించారు. సంస్థ కార్యదర్శి నేతి విశ్వేశ్వరరావు నేతృత్వంలో కళాకారుల్ని సత్కరించారు. కచేరి అనంతరం ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్ని సహాయ కార్యదర్శులు గిరిజాశంకర్, కృష్ణకిశోర్ పర్యవేక్షించారు.

రేపటి నుంచి ఉచిత ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు



గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయి విద్యార్థులకు ఆదివారం నుంచి ఉచిత ఐఏఎస్ ఫౌండేషన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) కన్వీనర్ కె.సాయికుమార్ తెలిపారు. శ్యామలానగర్‌లోని తన నివాసంలో శుక్రవారం శిక్షణ తరగతుల పోస్టర్లను ఎమ్మెల్సీ లక్ష్మణరావు విడుదల చేశారు. బ్రాడీపేట 2వ లైనులోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సాయంత్రం 6.00 గంటల నుంచి 8.00 గంటల వరకు 10 రోజులపాటు నిర్వహించే కార్యక్రమంలో సబ్జెక్టు నిపుణులతో పాటు ఉన్నతాధికారులు తరగతుల్ని బోధిస్తారని ఆయన పేర్కొన్నారు. పేర్లను నమోదు చేసుకునేందుకు 91215 14792, 72075 66702, 94939 06174 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో చండీ, రుద్ర హోమాలు



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ఆలయ ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణం కాంక్షిస్తూ శుక్రవారం గణపతి, చండీ, రుద్ర హోమాల్ని నిర్వహించారు. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో రుత్వికులు వేదమంత్రాల నడుమ అత్యంత భక్తిశ్రద్ధలతో హోమాలు, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, పాలకవర్గ సభ్యులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. తొలుత ప్రాంగణంలోని శివలింగానికి విశేష అభిషేకార్చనలు జరిపారు.

మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ పక్కాగా అమలు

కమిషనర్ కీర్తి చేకూరి



ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో మాన్ సూన్ యాక్షన్ ప్లాన్ మేరకు ప్రధాన కాల్వల్లో పూడికతీత పనులకు టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. తన చాంబర్‌లో శుక్రవారం ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్లలో పూడికతీత పనులు పక్కాగా జరగాలని, ముందు, తర్వాత ఫొటోలతో ఫైల్ చేయాలని ఆదేశించారు. పనుల్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, తీసిన పూడికను ఎప్పటికప్పుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా తరలించాలని ఆదేశించారు. పార్కుల అభివృద్ధి పనులు నిర్దేశిత గడువు ప్రకారం జరగాలని సూచించారు. ఐలాండ్స్ పనులు కొన్నిచోట్ల నత్తనడకన జరుగుతున్నాయని తదుపరి సమావేశం నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈఈలను ఆదేశించారు. ఎక్కడా తాగునీటి సమస్యలు రాకుండా పర్యవేక్షణ చేయాలని, సచివాలయాల వారీగా ఎమినిటీ కార్యదర్శులు పైప్‌లైన్ లీకులు, కలుషిత నీటి సరఫరాపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు సుందర్రామిరెడ్డి, శాంతిరాజు, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత వర్సిటీని రూపొందిద్దాం



ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య రవిశేఖర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్‌రెడ్డి తదితరులు

ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్



బిజినెస్ ప్లాన్ వివరిస్తున్న విద్యార్థినుల బృందం

ఏఎన్‌యూ: పర్యావరణ, మానవ ఆరోగ్యాన్ని పరిరక్షించే విధంగా ప్లాస్టిక్ రహిత యూనివర్సిటీని రూపొందిద్దామని సిబ్బంది, విద్యార్థులకు వీసీ ఆచార్య పి. రాజశేఖర్ చెప్పారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ప్లాస్టిక్ వద్దు- ఆరోగ్యమే ముద్దు' నినాదంతో అందరం ముందుకుసాగుదామని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిర్మూలన ఆవశ్యకతపై ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు సమాజానికి అవగాహన కల్పించాలని సూచించారు. రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలలకు చెందిన 350 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు యూనివర్సిటీ ప్రాంగణంలో తిరిగి ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాల్ని తొలగించారు. అనంతరం వాటిని ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ ప్రాంతానికి తరలించారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య రవిశేఖర్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ రవిశంకర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రవికుమార్, ఆచార్య నిరుపమ, డాక్టర్ సూర్యనారాయణ, ఆచార్య జి. నాగరాజు, డాక్టర్ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

బిజినెస్ డిబేట్‌లో విద్యార్థుల ప్రతిభ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిజినెస్ క్లబ్‌లో భాగంగా శుక్రవారం ప్లాన్, డిబేట్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. 18 బృందాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పలు అంశాలలో బిజినెస్ ప్లాన్‌ను చార్ట్‌లపై పొందుపరిచి వాటిని వివరించారు. వీరిలో ప్రతిభ కనబరిచిన ఆరు బృందాల్ని రెండవ రౌండ్‌కు, వారిలో ప్రతిభ కనబరిచిన మూడు బృందాల్ని విజేతలుగా ఎంపిక చేశారు. జడ్జిలుగా విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎన్. రత్నకిషోర్, డాక్టర్ ఎస్. ప్రసన్నకుమార్ వ్యవహరించారు. బిజినెస్ ప్లాన్‌లో మొదటి బహుమతిని మౌనిక నేతృత్వంలోని బృందం, రెండవ బహుమతిని శిరీష బృందం, మూడవ బహుమతిని ఐయాజ్ బృందం గెలుచుకున్నాయి. డిబేట్‌లో మొదటి బహుమతిని రాధిక నేతృత్వంలోని బృందం, రెండవ బహుమతి అఖిల బృందం, మూడవ బహుమతి వెంకట సాయి బృందం గెలుచుకున్నాయి. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య ఆర్. శివరాం ప్రసాద్ అధ్యక్షత వహించారు. అధ్యాపకులు నాగరాజు, విష్ణు, సుధీర్, భానురెడ్డి, రాజీవ్ పాల్గొన్నారు.

బాలికకు అరుదైన శస్త్రచికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ కృష్ణ స్రవంత్

గుంటూరు ఈస్ట్: ప్రమాదంలో గాయపడిన బాలికకు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ఆదిత్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత డాక్టర్ కృష్ణ స్రవంత్ చెప్పారు. ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన ఏడు సంవత్సరాల జ్ఞానలక్ష్మి ఏప్రిల్ 22న ప్రమాదవశాత్తు గాయపడింది. ముఖం, కండరాలు, ఎముకలు నుజ్జునుజ్జు అయ్యాయి. ముఖం మొత్తం ఏకమైపోయింది. కుడికన్ను పక్కకు జరిగింది. బాలిక తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకురాగా, ప్రాథమిక పరీక్షలు చేశారు. ఆరుగురు వైద్యుల బృందం ఎనిమిది గంటలపాటు అరుదైన సర్జరీ చేశారు. కంటిచూపు దెబ్బతినకుండా, ముఖం రూపు యథావిధిగా వచ్చేలా విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించినట్లు డాక్టర్ కృష్ణ స్రవంత్ వివరించారు. బాలిక తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో డాక్టర్ అమూల్య, డాక్టర్ కళ్యాణ్, మత్తు వైద్యురాలు ఎస్.శిరీష, వైద్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే..



సమావేశంలో మాట్లాడుతున్న కవి జయరాజ్

గుంటూరు ఎడ్యుకేషన్: గౌతమ బుద్ధుడు, కార్ల్ మార్క్స్ వంటి మహనీయుల తత్వజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్ తరాల్ని తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపైనే ఉందని ప్రముఖ తత్వకవి, అభ్యుదయవాది జయరాజ్ పేర్కొన్నారు. చంద్రమౌళీనగర్ భాష్యం విద్యాసంస్థల సమావేశ మందిరంలో మానవత, స్టెప్, సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'టీచర్ ఎంపవర్‌మెంట్' ప్రోగ్రాంలో భాగంగా గౌతమ బుద్ధ, కార్ల్ మార్క్స్ జయంతి సందర్భంగా జయరాజ్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. కాలానికి అతీతంగా గౌతమ బుద్ధుని సిద్ధాంతాలు కనిపిస్తాయని అన్నారు. సమాజంలో దోపిడీని ప్రశ్నించి, శోధించి ఆచరణాత్మక పరిష్కారం చూపించడంలో కార్ల్‌మార్క్స్ విజయం సాధించాడని చెప్పారు. మనిషి శక్తివంతుడు అవ్వడానికి కారణాలను అన్వేషిస్తూ భావ స్ఫూర్తిని నిలపడానికి శిలా నీవే, శిల్పి నీవే కవితా సందేశం ఇస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉండాలని ఆయన సూచించారు. జ్ఞాన సమపార్జన ద్వారా వారిని నైతిక విలువలతో మానవీయ పౌరులుగా మలచాలని ఉద్బోధించారు. సెంటర్ ఫర్ సోషల్ సైకాలజీ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్టెప్ వ్యవస్థాపకులు ప్రత్యూష సుబ్బారావు, మానవతా చైర్మన్ పావులూరి రమేష్, నగర అధ్యక్షుడు ఎన్. రామారావు, అనంతరామయ్య, ప్రగతిశీల నారీశక్తి అధ్యక్షురాలు పాట్లూరి దేవి రాజకుమారి, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రమాదేవి, డాక్టర్ రాజశేఖర్, గయాస్ పాల్గొన్నారు.